# కళనామహిళ

ఇంట్లో కుండలు డింకీ కొడుతున్నాయి. ఇటీవలే పెద్దమనిషి అయిన చెల్లాయి ఒకర్తె ఉంది. దాని తర్వాత ఏడో తరగతి చదువుతున్న తమ్ముడొకడున్నాడు. వాడి వెనక మరో బుజ్జి తమ్ముడున్నాడు. వీళ్ళందర్నీపోషించలేక సతమతమవుతున్న బడిపంతులు తండ్రి అవస్థను చూసి, తండ్రికి ఎట్టి సహాయమూ చెయ్యలేని దుస్థితిలో బతుకు తెరువుకై మదరాసు మహానగరం చేరుకున్నాడు నటవరం ఇరవై ఏళ్లపిన్నవయస్సులో.

తండ్రి బెంగ పెట్టుకుని "కుర్రవాని వయస్సు ఇరువది, చామనచాయ, ఎత్తు అయిదూ నాలుగు, పేరు నటవరం. తెలుగూ ఇంగ్లీషూ మాట్లాడగలడు. ఈ కుర్రవాని ఆచూకీ తెల్పినవారికి చక్కని బహుమతి (అదైనా నేను రిటైరయేక, బతికుండగా నా పెన్షను, గ్రాట్యుయిటీ, ప్రావిడెంటు ఫండూ అందితే) నాయనా! నీకోసం తల్లి బెంగ పెట్టుకుని మంచాన పడ్డది. చెల్లాయి, తమ్ముళ్లు తిండి సరిగ్గా తినడం లేదు. ఎక్కడున్నా నువ్వు తక్షణమే రావలసింది". అని పత్రికా ప్రకటన వెలువడుతుందని ముందుగానే ఊహించిన నటవరం- ప్రకటన వెలువడకుండానే- "నేను క్షేమంగానే మదరాసు చేరుకున్నాను. నా మిత్ర కొడుకు నాకు ఆశ్రయం ఇచ్చేడు. అతనో ఘోస్టు రైటరు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాను. అందాకా మిరపకాయ బజ్జీలు బన్ రొట్టెలు తింటూ కాలం గడుపుతున్నాను. నా తరువాత చెల్లాయి పుట్టగానే మీరు ఎర్ర త్రికోణం అమలు జరిపి ఉంటే, నేను మన నగరం విడిచి పెట్టేవాణ్ణికాను.

కానీ మీరలాచెయ్యకుండా నాకు మరో ఇద్దరు తమ్మళ్లను ప్రసాదించడంవలన, మీరు మమ్మల్నందర్నీ పోషించలేకపోతున్నారు. నాకేమో ఉద్యోగంచేసే వయస్సు ఇప్పుడే వచ్చింది. ఉద్యోగాల్లేవు కదా! అంచేత ధనార్జన కోసమే, అంటే లక్షలకి లక్షలు కాదు, కనీసం నన్ను నేను పోషించుకుంటే చాలని ఇక్కడికి పారిపోయొచ్చాను. నా గురించి బెంగ పెట్టుకోకండి". అంటూ ఒక శుభోదయాన తండ్రికో ఉత్తరం పడేశాడు నటవరం.

తనకు ఆశ్రయం ఇచ్చిన అసిస్టెంటు సినీరచయిత సహాయంతో ఓ స్టూడియోకి వెళ్లగా, రాజుగారు బంటు వేషం వెయ్యడానికి ఒక పోస్టు ఖాళీగా ఉంది. నువ్వు వేస్తావా? అని డైరెక్టరు మహాశయులుంగారు అడిగిందే తడవుగా- "ఓ తప్పకుండా! నా క్కావలసింది డబ్బు. డబ్బుకోసం ఏంచేయమన్నా చేస్తాను. ఏ వేషం వెయ్యమన్నావేస్తాను. ఏ అవతారం ఎత్తమన్నా ఎత్తుతాను!" అని రెడీ రిప్లయి ఇచ్చాడు నటవరం.ఓ ఐదేళ్లపాటు అలా అలా అలా వేషాలు వేశాడు. మరో పదేళ్లలో ఆర్థికంగా మాంఛి పునాది పడ్డాది. కొన్ని లక్షలు సంపాదించాడు. నల్లధనం కూడబెట్టి 'నల్ల' తంబి అయేడు. చెల్లాయికి 'ఏ' క్లాసు అమెరికా సంబంధం చూసి పెళ్లి చేశాడు. తమ్ముళ్లకి లండన్ పబ్లిక్ స్కూలు ఎడ్యుకేషను. తాను మదరాసులో నిర్మించుకున్న రమ్యహర్మ్యంలో తల్లిదండ్రులు తనతోపాటే ఉంటున్నారు. నటోత్పల, నటచంపక, నటశార్దూల, నటమత్తేభ అనే బిరుదులు సంపాదించుకున్నాడు.

మహానటుడు నటవరం పేరు అష్టదిక్పాలురకీ తెలియడంతో - తన స్వస్థలమైన నగరంలో పురపాలక సంఘంవారు పౌరసన్మానం చేశారు.

ఆదిలో - "నాకు డబ్బు ప్రధానం, డబ్బుకోసం ఏవేషానికైనా, ఏ అవతారానికైనా సిద్ధమే" అన్న వటవరం ఇప్పుడు హిజ్ మాస్టర్స్ వాయిస్ ప్లేటు ఫిరాయిస్తూ - తనకు జరిగిన ఈ ఘన సన్మానానికి కృతజ్ఞత చెబుతూ అన్నాడు.

"సోదర సోదరీమణులారా! పుర ప్రముఖులారా! నేనీనాడు మీ మధ్య ఒక గొప్ప కళాకారునిగా నిలబడగలిగేనంటే మీ ఆదరాభిమానాలే కారణమని నొక్కి వక్కాణిస్తున్నాను. నేను, కళాదేవత ఆరాధనకై ఏంచెయ్యమన్నా చేస్తాను, నేను కళ కోసమే జీవిస్తున్నాను. కళ నాకోసమే జీవిస్తోంది. కళే నా జీవిక, నేనే కళకి జీవిక. వాగర్థాలవలే ఒకరి నొకరు ఆశ్రయించుకుని ఉన్నాం. పార్వతిని ముక్కంటి తన ఒంటికి అంటి పెట్టుకుని ఉన్నట్టు నా ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాల్లో కళా సరస్వతి తప్ప వేరొకరు లేరు. సూక్ష్మంగా చెప్పాలంటే కళ నా మహిళ!" బల్లగుద్ది, మైకుని చీల్చి చెండాడేసి, ఉపన్యాసం దంచేడు కరతాళ ధ్వనుల మధ్య.

19-1-1990
ఆంధ్రభూమి దినపత్రిక